క్లుప్తంగా

విద్యుత్ తీగలను సరిచేసిన అధికారులు



నడికూడ : మండల కేంద్రంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఇనుప విద్యుత్ స్తంభాల నుంచి తెగిపోయి ప్రమాదకరంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం సాక్షి దినపత్రిలో 'ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?' అనే కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

రమాదేవికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు డి.రమాదేవికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హ్యూమన్ రిసోర్స్ ప్రాక్టీసెస్ ఇన్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ – ఏ స్టడీ ఆన్ ఎల్‌ఐసీ వరంగల్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రమాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ టీవీ.సుజాత పర్యవేక్షణలో రమాదేవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఒకరికి తీవ్రగాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన కడిపికొండ శివారులో శనివారం రాత్రి జరిగింది. మడికొండ ఎస్సై రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ ఎల్బీనగర్, పోచమ్మమైదాన్‌కు చెందిన జన్ను మధు, జన్ను రఘు కలిసి ట్రాలీ ఆటోలో కాజీపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో కడిపికొండ శివారు రాజీవ్ గృహకల్ప సమీపంలో ట్రాలీ ఆటోను గుర్తు తెలియని వాహనం పక్కనుంచి ఢీ కొట్టి వెళ్లింది. దాంతో ట్రాలీఆటో బోల్తాపడడంతో జన్ను మధుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాంమోహన్ వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: బిక్షాటన చేస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జి కింద ఉంటూ శివనగర్ ప్రాంతంలో బిక్షటన చేసి జీవనం సాగిస్తున్న వ్యక్తి అనారోగ్యానికి గురై మృతి చెంది ఉంటాడని పలువురు భావిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుడు వేల్పుగొండ మధుకర్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. గుర్తు తెలియని వ్యక్తి వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ వివరించారు.

ఆలయాల ముస్తాబు

కాజీపేట: కనులపండువగా సాగే ఉత్సవాలకు కాజీపేట పట్టణంలోని పోచమ్మ తల్లి ఆలయాలు వైభవంగా ముస్తాబయ్యాయి. చల్లనితల్లిగా భక్తులు కొలిచే పోచమ్మకు శ్రావణ మాసంలో బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఆదివారం నుంచి బుధవారం, ఆదివారాల్లో ఈ నెలాఖరు వరకు పోచమ్మకు ఊరూ వాడ బోనాలతో కదిలి జంతు బలులివ్వనున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో ఉన్న పోచమ్మ తల్లి ఆలయాలను ముస్తాబు చేశారు. ఉత్సవాల నిర్వహణ ప్రారంభమై వారమవుతున్నా చివరి రెండు ఆదివారాలే కీలకం. మేకపోతులు లాగే బండిలో తల్లి ఉత్సవ విగ్రహాలను ఊరేగించనున్నారు. పోతరాజులు, శివసత్తుల నృత్యాలు పోచమ్మతల్లి బోనాల పండుగలో ఆకర్షణగా నిలుస్తాయి. పిల్లా పాపలతో చిలుకల బోనాలు, కల్లు కావడీలతో ఆలయాలకు తరలివెళ్లి, తల్లికి పసుపు, కుంకుమలతోపాటు గాజులు, తెల్లని నూతన వస్త్రాలు సమర్పిస్తారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం

గీసుకొండ : ఆదివాసీల భూములు, అడవులు, హక్కులు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, సంప్రదాయ జీవన విధానాన్ని, ప్రకృతి ఆరాధనను, భవిష్యత్ తరాల స్వేచ్ఛను కాపాడటానికి పోరాడాలని ఆదివాసీ తోటి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని అనంతారంలో తోటి తెగల కాలనీలో ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అడవులు, పోడు భూముల నుంచి గిరిజనులను వెళ్లగొట్టడం ఆపాలని, పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల్లో తోటి తెగల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పీవీటీజీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సోయం సాంబయ్య, నాయకులు గుర్రం దిలీప్, సోయం అరవింద్, చరణ్, అరుణ, సంతోష్, మురళి, హాలియా తదితరులు పాల్గొన్నారు.

రాఖీలు కట్టి.. ఆశీర్వదించి



పరకాల : సోదరుడికి రాఖీ కడుతున్న అక్షర



పరకాల : సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి



ఆత్మకూరులో..



శాయంపేట : మత్స్యగిరిస్వామి ఆలయంలో జంజిరాలు ధరిస్తున్న పద్మశాలీలు

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి సోదరులు నివసించే ప్రాంతాలకు తరలివచ్చిన సోదరీమణులు.. వారికి రాఖీలు కట్టి ఆశీర్వదించారు. రాఖీ పండుగ సందర్భంగా సాక్షి నిర్వహించిన 'సెల్ఫీ విత్ రాఖీ'కి అపూర్వ స్పందన లభించింది. సోదరీమణులతో రాఖీలు కట్టించుకున్న పలువురు సోదరులు సెల్ఫీలు తీసి సాక్షికి పంపించారు. వాటిలో కొన్ని..

– సాక్షి నెట్‌వర్క్



శాయంపేట : సోదరుడికి రాఖీ కడుతున్న మహా



పరకాల : ఆర్టీసీ డ్రైవర్‌కు రాఖీ కడుతున్న బాలిక



ధర్మసాగర్ : దేవునూరులో సోదరుడికి రాఖీ కడుతున్న అక్షయ



నడికూడ : రాఖీ కడుతున్న శిరీష



శాయంపేట : అశోక్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్సీ కవిత



కమలాపూర్ : పూజలు చేస్తున్న పద్మశాలీలు



ధర్మసాగర్ : రాఖీ కడుతున్న హర్షితారెడ్డి



దామెర : ఎస్సైకి రాఖీ కడుతున్న కానిస్టేబుల్



ధర్మసాగర్ : రాఖీ కడుతున్న అంకం శ్రావణి

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : జూన్ 05, 2025లోపు పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు 2025–2026 సంవత్సరానికి రైతుబీమా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గంగాజమున శనివారం తెలిపారు. రైతులు ఈనెల 13వ తేదీలోపు 18 నుంచి 59 ఏళ్ల లోపు రైతులు సంబంధిత ఏఈఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సురేందర్‌కు గద్దర్ అవార్డు



కమలాపూర్ : మండలంలోని గూడూరుకు చెందిన కలం (బూడిద) సురేందర్‌ను గద్దర్ అవార్డు వరించింది. ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రతినిధి, గద్దర్ శిష్యుడు శనిగరం బాబ్జీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు అవార్డు అందించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి తన ఆటాపాటలతో ప్రజలను చైతన్య పరిచిన సురేందర్‌కు తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు, కమలాపూర్ ప్రగతి యువజన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు అభినందించారు.

సంస్కృతిని కాపాడుకోవాలి

ఖానాపురం : సంస్కృతి, సంప్రదాయాలను ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసస్వామి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రమేశ్, తదితరులు

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లిలో శనివారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ శాయంపేటను అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: గ్రామీణ వాతావరణంతో అభివృద్ధికి నోచుకోని న్యూశాయంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ 31వ డివిజన్ పరిధి హనుమకొండ న్యూశాయంపేటలో రైల్వేగేట్ నుంచి పోచమ్మ ఆలయం వరకు రూ.90.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగగా, మళ్లీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో జరుగుతోందన్నారు. శాయంపేట పోచమ్మ ఉత్సవాలకు ప్రత్యేక విశిష్టత ఉందని, ఉత్సవాల సమయంలో భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చూస్తానని చెప్పారు. ఉత్సవాలకు ముందుగా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, కాంగ్రెస్ నాయకులు సురేందర్, సత్తు రమేష్, కృష్ణ, రవీందర్, రమేష్, సతీష్, అంకేశ్వర్ సురేందర్, గండ్రతి యాదగిరి పాల్గొన్నారు.

వైభవంగా జంజిరాల పౌర్ణమి వేడుకలు



రామన్నపేట: పూజలు చేస్తున్న పద్మశాలీలు

రామన్నపేట: నగరంలోని పోచమ్మమైదాన్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో జంజిరాల పౌర్ణమి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కులదైవం భక్త మార్కండేయుడికి ఆరాధన, కుంకుమ, పసుపుతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్, సెక్రటరీ గోరంట్ల రాజు, నాయకులు బేతి అశోక్, వంగర సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, సంగీత్, సుధాకర్, క్రాంతికుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జంజిరాల ధారణ వేడుక

రామన్నపేట: నగరంలోని ఎల్‌బీనగర్‌లో పద్మశాలి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గాయత్రి జంజిరాల ధారణ, రక్షాబంధన్ వేడుకలను శనివారం నిర్వహించినట్లు బ్రహ్మణుడు పెద్దూరి శ్రీనివాస్ తెలిపారు. ముందుగా గణపతి, గాయత్రి పూజలు నిర్వహించి గాయత్రి మంత్రంతో జంజిరాలు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా ట్రస్ట్ ఉపాధ్యక్షుడు గోరంట్ల రాజు, కార్యదర్శి సుధాకర్, సాంస్కృతిక కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి దశరథం, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సామూహిక జంజిరాల ధారణ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని మార్కండేయ దేవాలయం వద్ద పద్మశాలి పరపతి సంఘం భవనంలో మేరుగు అశోక్ ఆధ్వర్యంలో పద్మశాలీలకు సామూహిక జంజిరాధారణ కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. ముఖ్యఅతిథిగా కుసుమ సతీష్ హాజరై గాయత్రి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తాళ్ల సమ్మన్న, ఆడెపు భిక్షపతి, గడ్డం రవి, మాచర్ల రవీందర్, చెన్నూరి దేవేందర్, ఆడెపు వెంకటేష్, బైరి శ్యామ్, పిట్ట రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



వేలేరు నుంచి కమ్మరిపేటకు వెళ్లే రోడ్డులో నిలిచిన వరదనీరు



వేలేరు ఎస్సీ కాలనీలో పాడుపడ్డబావిలో నిలిచిన వర్షపు నీరు

- మురుగునీటితో కంపు కొడుతున్న కాలనీలు
- దశాబ్దాలు గడుస్తున్నా మారని పరిస్థితి
- ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

వేలేరు : మండల కేంద్రంతో పాటు కమ్మరిపేట, లోక్యతండా గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం వర్షాకాలం అవడం, కాలనీల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలనీల్లోని రోడ్లపై వరద నిలిచి రోడ్డంతా బురదమయంగా మారుతోంది. దీంతో ఆ దారి గుండా వెళ్లే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటిని తొలగించాల్సిన పంచాయతీ అధికారులు ముఖం చాటేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు

గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. మండలానికి జిల్లాస్థాయి అధికారిని, మండలంలోని ఆయా గ్రామాలకు మండలస్థాయి అధికారిని ప్రత్యేకాధికారులను నియమించగా వారు సమస్యల పరిష్కారానికి ఏమాత్రం కృషిచేయడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామాలను నెలలో ఒకటి, రెండుసార్లు కూడా సందర్శించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురికి కాల్వల్లో పూడిక తీయకపోవడం, కొన్ని కాలనీల్లో మురికి కాల్వలు లేకపోవడంతో నీరు రోడ్లపైనే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వ్యాప్తిచెంది అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్లపైనే నిలుస్తున్న మురుగునీరు



వర్షం కురిస్తే బురదతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీధుల్లో మురుగునీరు నిలువడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఈగలు, దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నాం. పాలకులు, అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

ఎండి.అజీమ్, వేలేరు

గోవిందరాజుల గిరి ప్రదక్షిణ



రామన్నపేట: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గత కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న గోవిందరాజుల స్వామి గిరిప్రదక్షిణను శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని సుందరంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి కనుల పండువగా ఊరేగించారు. రాఖీ పౌర్ణమి కావడంతో స్వామిగిరి ప్రదక్షిణకు ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఘనంగా యువజన కాంగ్రెస్ దినోత్సవం



పండ్లు పంపిణీ చేస్తున్న నాగరాజు

శాయంపేట : మండల కేంద్రంలో శనివారం యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ పార్టీ న్యాయం కోసం పోరాడుతుందన్నారు. యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవీ చేపట్టడం ఖాయమన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో అధిక సీట్లు గెలుపొందడం ఖాయమన్నారు. అందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీటర్, క్రాంతి, రాకేష్, నాగరాజు, యశ్వంత్, సన్ని, బన్ని, సీనియర్ నాయకులు రవీందర్, రవి, రవిపాల్ పాల్గొన్నారు.

అపూర్వమైన పండుగ రక్షాబంధన్



హన్మకొండ కల్చరల్: ఆప్యాయత, అనుబంధాలు సమ్మిళితంగా ప్రకటితమయ్యే అపూర్వమైన పండుగ రక్షాబంధన్ అని ఆధ్యాత్మిక ప్రవచనకర్త వంగల సోమయాజులు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మన గుడి శ్రావణ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా హనుమకొండ రెడ్డికాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శ్రావణ పౌర్ణమి విశిష్టతపై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో టీటీడీ డీపీపీ ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి కృష్ణమూర్తి, ఆలయ చైర్మన్ ముప్పిడి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తిని వెంకటయ్య, అర్చకుడు కొండపాక శ్రీనివాసాచార్యులు, కార్యవర్గ సభ్యులు భాగ్యలక్ష్మి, కరుణశ్రీ, లలిత పాల్గొన్నారు.